కథ



# సరైన అభ్యర్థి

● ప్రతాప వెంకట సుబ్బారాయుడు

రాష్ట్ర సచివాలయం. పలుప్రాంతాల ప్రజాప్రతినిధులంతా కొలువుండే దేవాలయం.

అరవై అయిదేళ్ల రామనాథంగారు మసక బారిన కళ్లజోడును ఒకసారి తుడుచుకుని తలుపుకు వేళాడదీసిన బోర్డుపై ఉన్న ఇత్తడి అక్షరాలను చదివాడు.

"కంప ముని, కార్మిక శాఖ మంత్రి"

ఆయనే తనకు కావలసిన వ్యక్తి అనుకుని, అక్కడున్న బాయ్‌కి మంత్రి నుంచి తనకొచ్చిన ఉత్తరం చూపించి, తన పేరు కాగితం మీద రాసిచ్చాడు. అతడు ఆయన వంకోమారు విసుగ్గా చూసి "ఇంకా సార్ రాలేదు. అక్కడ కూర్చో. వచ్చాక సార్ నిన్ను రమ్మంటే పిలుస్తాను" అన్నాడు. అప్పటికే చాలామంది అక్కడున్న కుర్చీల నాక్రమించారు. రామనాథం గారు ఖాళీగా వున్న ఒకే ఒక్క సీట్ దగ్గరకెళ్లి కూర్చున్నాడు.

ఆయన మనసు గతాన్ని అవలోకిస్తోంది.

✦ ✦ ✦

రామనాథంగారు ప్రభుత్వ పాఠశాలలో లెక్కల మాస్టారు. ఆయనకు పిల్లలు, లెక్కలు అంటే ప్రాణం. ఆడిస్తూ, పాడిస్తూ, లెక్కలు చేయిస్తూ పిల్లలకు లెక్కల మీద ఉన్న భయం పోగొట్టేవాడు.

అప్పుడప్పుడే ప్రైవేట్ స్కూళ్లు వేళ్లూనుకుంటున్న రోజులు. ప్రభుత్వ పాఠశాలల్లో 'బతకలేక బడిపంతులు'గా ఎందుకు.. చక్కగా ఏ ప్రైవేట్ స్కూలులోనన్నా ఇదే కష్టంపడితే నాలుగు రాళ్లు ఎక్కువ సంపాదించుకోవచ్చు అని ఇంట్లో ఇల్లాలి పోరుతో పాటు, తెలిసిన వాళ్ల సలహా ఇస్తే, "అందరూ అలా డబ్బుబాట పడితే పాపం బోలెడన్ని ఫీజులు కట్టి ప్రైవేటు స్కూళ్ళల్లో చదువుకోలేని ఆ పిల్లలకు చదువు చెప్పేదెవరు?వాళ్లకు మాత్రం భవిష్యత్తు బంగారం కానక్కర్లేదా?" అని వాళ్లకోసం తాపత్రయ పడేవాడు.

ముని ఏడవ తరగతి చదువుతున్నప్పుడు.. అతని తండ్రి తాగితాగి చనిపోతే, ఇంట్లోని పరిస్థితులు అనుకూలించక అతడు చదువు మానెయ్యాలనున్నప్పుడు రామనాథం మాస్టారే అతని ఇంట్లో వాళ్లతో గట్టిగా మాట్లాడి కనీసం పది వరకు చదివించమని ముని తరపున వాదించి వాళ్లను ఒప్పించాడు. అంతేకాకుండా ఇంట్లో డబ్బు అవసరమైనప్పుడు ఇస్తూ.. పుస్తకాలు, పెన్నులు కొనిస్తూ పది పూర్తి చేయించాడు.

ముని కళ్ళనీళ్ళతో ఆయన కాళ్ళకు దణ్ణం పెడుతూ "మాస్టరుగారూ మీరే లేకపోతే నా బతుకు గాలివాటానపోయే కాగితమయ్యేది.. చదువు వల్ల నాకు ఆలోచనాశక్తి పెరిగింది. నన్ను నేను తీర్చిదిద్దుకోలనన్న నమ్మకం కలిగింది."

ఆయన మనసు ద్రవించిపోయింది "నువ్వు పైకిరావడమేరా నాకు కావలసింది" అని మునిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు.

ఆ తర్వత కొన్నాళ్లు ముని కన్పించలేదు. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేసుకుంటున్నాడేమో అనుకున్నాడు. తర్వాత ఒకసారి ఊళ్లో హఠాత్తుగా కనిపించాడు. తమ ఊరికి కొద్దిదూరంలో ఉన్న ఒక ఫ్యాక్టరీలో పని చేస్తున్నాట్ట. అంతేకాదు కార్మిక నాయకుడుగా కష్టించేవాళ్లకు అన్యాయం జరిగినపుడు వారి పక్షాన పోరాడుతూ, వాళ్లకి న్యాయం జరిగేలా చేస్తున్నాడట. రామనాథం గారికి ఎంతో ఆనందం కలిగింది. తను పెంచిన మొక్క పది మందికి ఆధారమవుతోంది.

✦ ✦ ✦

ఆ తర్వాత కొన్నేళ్లకు ముని రాజకీయంగా అంచలంచలుగా ఎదుగుతూ మంత్రి అయ్యాడని తెలిసింది.

ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబ నేపథ్యమున్న ముని అందలం ఎక్కడం రామనాథంగారికి చాలా ఆనందం కలిగించింది. అలాంటి వాళ్లే పరిపాలనకు అర్హులని తెలిసినవాళ్లకు పిలిచి మరీ చెప్పేవాడు.

ఇదిలా ఉండగా రామనాథంగారు మాస్టారుగా పది దీపాలు వెలిగించడం తప్ప పది రాళ్లు వెనకేసుకుంది లేదు. దాచుకున్న డబ్బుకాస్తా కూతురి పెళ్ళికి ఖర్చయిపోయింది.

పులిమీద పుట్రలా తను రిటైరయిపోయాడు. ఇంక ఆ ఇంటికి కొడుకు ఒక్కడే ఆధారం. ఒకసారి గవర్నమెంట్ ఆఫీసులో ఒక పోస్టుకు జరిగిన ఇంటర్వ్యూలో రామనాథంగారి అబ్బాయి అన్నీ బాగానే చెప్పాడు. కానీ బయట ఎవరో ఆ పోస్టు ఎప్పుడో అమ్ముడు పోయిం దని చెప్పాడట. దాంతో కొడుకు ద్వారా ఆ విషయం విన్న రామనాథంగారు ప్రాన్పడి పోయారు.

తర్వాత ముని గుర్తుకొచ్చాడు. అవును ముని తనడిగితే ఏదీ కాదనడు. తన కోసం ఏమైనా చేస్తాడు. ఈ పనెంత? రామనాథం గారికి ఉత్సాహంవచ్చింది. మునిని కలవాలను కుంటున్నట్టు ఉత్తరం రాసి ప్రముఖ దిన పత్రికలో జర్నలిస్టుగా పనిచేసే రాజారావు ద్వారా ముని చిరునామా సంపాదించి ఆ ఉత్తరం పోస్ట్ చేశాడు. సమాధానం వస్తుందో, రాదో అన్న డోలాయమాన పరిస్థితిలో కొద్దికాలం గడిపాడు. ఫలాన రోజునాడు ఫలాన టైంకు సచివాలయంలో తనను కలవ వచ్చన్న ఉత్తరమది. రామనాథం ఆ రోజంతా పెళ్లానికి, పిల్లాడికీ ఆ ఉత్తరం ఎన్నిసార్లు చూపించాడో. మునిని ఎంతగా శ్లాఘించాడో.

✦ ✦ ✦

"మాట్లాడకుండా కామ్‌గా ఉండండి..సార్ వస్తున్నారు" అరుపు వినిపించడంతో మళ్లీ ఈ లోకం లోకి వచ్చారు రామనాథంగారు.

ముందు ముని ఆ వెనక అనుచరగణం తన ముందునుంచి వెళ్లడం చూశారు రామ నాథం గారు.

'తన పిచ్చిగాని అంత ఎత్తులో ఉన్న ముని తనను గుర్తుపడతాడా? తనను రమ్మని ఉత్తరం రాయడమే ఓ గొప్పవిషయం' మనసులో అను కుంటుండగా.. "సార్" అన్న మాట వినిపించి తలెత్తారు.

ఎదురుగా ముని.. చేతులు కట్టుకుని..

సంభ్రమంగా ఆయన లేవబోయారు.. ఆయన్ని ఆప్యాయంగా కూర్చోబెట్టి" మీరం దరూ.. ఈయన్ని చూడండి.. ఈయన మా మాస్టారుగారు.. ఆ రోజు మేము ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి చదువు ఆపేద్దామనుకుంటే ఈయనే మా వాళ్లతో మాట్లాడి నా చదువు పూర్తి చేయించారు. నా వరకు నాకు ఈయన చదువుల సరస్వతి. మీకింతవరకు మన స్ఫూర్తిగా నమస్కరించే అవకాశం దొరక లేదు.. ఇప్పుడు మీ అందరి ముందు సాష్టాంగ నమస్కారం పెడుతున్నాను" అని అక్కడి నేల మీద పడుకుని ఆయన పాదాలకు నమస్క రించాడు. అక్కడున్న అందరూ చప్పట్లు కొట్టారు. విలేకరులు ఫోటోలు తీశారు. ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. చదువు పూర్తయింతర్వాత మాస్టార్లను, పాఠశాలను మర్చిపోయేవాళ్లే దాదాపు అందరూ, ఒకవేళ ఎక్కడన్నా కలిసినా నాలుగు పొడి మాటలు మాట్లాడతారు తప్ప గురుభక్తి ప్రదర్శించరు. శిష్యులు ఉన్నత స్థానంలో ఉండి, ఆ అనుభూతిని మాస్టార్లతో పంచుకున్నప్పుడు వాళ్ల హృదయాలు మబ్బు లను తాకే గాలిపటాలవుతాయి. చదువు చెప్పిన గురువులకు కావలసింది అదే! సన్మానాలు.. సత్కారాలు అవసరమే లేదు.

గబగబ మునిని పైకి లేవదీసి "చిరంజీవ.. ఇంకా జీవితంలో పైకి రావాలని కోరుకుంటు న్నానయ్యా" అన్నారు.

ముని పైకి లేచి "మీరందరూ కొద్దిసేపు వెయిట్ చెయ్యగలిగితే, నేను ముందు సార్ వచ్చిన పనేమిటో కనుక్కుని.. తర్వాత మిమ్మల్ని పిలుస్తాను" అని "పదండి మాస్టారూ.." అంటూ తన గది వైపు దారితీశాడు.

లోపలికెళ్లాక, "చెప్పండి మాస్టారు.. అసలు నేనే మీ ఇంటికి వచ్చే ప్లాన్ చేశాను.. కానీ ముఖ్యమంత్రి గారు కొన్ని ముఖ్యమైన పనులు అప్పగించారు.. అందుకని నేను రాలేక మీకు ఇక్కడి కొచ్చే శ్రమిచ్చాను.. క్షమిం చండి.. ఇంతకీ మీరొచ్చిన పని?" అన్నాడు.

"నాపట్ల నీకున్న అభిమానానికి ధన్యవాదా లయ్యా.. ఏంలేదు మా అబ్బాయి ఒక ఇంటర్వ్యూకు అటెండ్ అయ్యాడు. వాడిని ఆ ఉద్యోగానికి సిఫార్సు చేయమని అడగడానికి రాలేదు. దాన్నెవరో కొనుక్కున్నారన్న వదంతి వినిపించింది. అలా జరక్కుండా అది సరైన అభ్యర్థికి దక్కేలా చూడు. అది నా కొడుకే అవనవసరం లేదు." అన్నారు.

"ఓహ్.. అలాగా మాస్టారు.. ఇప్పటికా్కదా మీరేం మారలేదు మాస్టారుగారు. మీ అబ్బాయి కి కాకుండా సరైన వ్యక్తికి ఆ ఉద్యోగం దక్కేలా చేయమంటున్నారు. మీరు పాటించే వాటిలో మాకు కొన్ని వచ్చినా మేము ప్రజాసేవ నిస్వార్థంగా చేయగలుగుతాము." అన్నాడు.

"చాలు నాయనా ఆ మాట చాలు. ఇహ నేను వెళ్ళొస్తా" అని లేచాడు. ఆయన్ని సాదరంగా తలుపుదాకా దిగబెట్టాడు.

ముని ప్రవర్తనతో కడుపు నిండిపోయినా, టాబ్లెట్ వేసుకోవాలి కాబట్టి అక్కడ ఉన్న క్యాంటీన్లో ఇడ్లీ తిని వేసుకోవచ్చు అనుకుని.. క్యాంటీన్లోకి దారితీశాడు.

నింపాదిగా రెండు ఇడ్లీలు తిని మందు బిళ్ల వేసుకుని టీ తాగుతుంటే.. తన ఎదురుగా ఉన్న కుర్చీల్లో ఇద్దరు కూర్చున్నారు.

"ఏరా పనయిందా?"

"ఆ.. ముని చాలా ఎక్కువ అడిగాడు. కానీ ఏంచేస్తాం కాంపిటీషన్ అట్లుంది. డబ్బు ఏర్పాటుచేశానని నమ్మకం కుదిరాకా పోస్ట్ మా వాడికిప్పించాడు"

తను ఏ పోస్ట్‌కోసం వచ్చాడో దాని గురించే వాళ్లు మాట్లాడుకుంటుంది. రామనాథం గారికి భూమి గిర్రున తిరుగుతున్నట్టు అనిపించింది. ముని బా..గా ఎదిగిపోయాడు. తనని అందరి ముందూ గొప్పగా వాడుకున్నాడు. రేపు పేపర్లలో 'సచివాలయంలో తన మాస్టారుకి మంత్రి సాష్టాంగం' అని వస్తుంది. ఆ వెలుగు లో తన చీకటి చర్యను కప్పేసుకున్నాడు. అయినా మునేం తప్పు చేశాడు? తను 'సరైన అభ్యర్థికి' పోస్ట్ దక్కేలా చూడమన్నందుకు అత్యధికంగా డబ్బిచ్చే సరైన అభ్యర్థికే ఇప్పిం చాడు. ఆకాశం నుంచి అమాంతం అగాధంకు కూరుకుపోయిన మనసుతో భారంగా ఇంటి వైపు అడుగులేశారు రామనాథంగారు. ■

### దొరికి పోయాడు

టెలిఫోన్‌లో ఒక మహిళా స్వరం : హలో సుధీర్ సర్, నేను మిమ్ములను కలిసి మాట్లాడాలి
సుధీర్ : మీకు నేను తెలుసా
మహిళా : మా పిల్లల్లో ఒకని తండ్రి మీరు
దానితో షాక్‌కు గురయి : ఓహ్ మై గాడ్...
మీరు సంగీతా ????
కాదు
మీరు మేఘ్న ???
కాదు
మీరు నిషా ??
కాదు
మీరు నేహా ?
కాదు.
మీరు మోనికా ?
కాదు
అనుష్క ?
కాదు
వైశాలి ?
కాదు
దానితో ఖంగారు పడిన ఆ మహిళా : నేను మీ కొడుకు క్లాస్ టీచర్‌ని అండి.